
ప్రజాశక్తి
ఆదివారం 4 ఫిబ్రవరి 2024
5
పార్వతీపురం మన్యం





శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన మనజీర్ జిలానీ సమూన్‌ను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతంపేట ఐటిడిఎకు సంబంధించిన పలు అభివృద్ధి పనులను పిఒ కలెక్టర్‌కు వివరించారు. -ప్రజాశక్తి, సీతంపేట

జీడి రైతు ఆశలు అడియాసలేనా?

టీదోమ సోకడంతో తగ్గనున్న పంట దిగుబడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది కూడా కారు మబ్బుల ప్రభావం జీడి పంటపై పడడంతో రైతులు ఆశించినంత స్థాయిలో పంట దిగుబడి లేకపోతే గిరిజన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. గత నాలుగేళ్ల నుంచి జీడి పంట కాపు సమయాన కారు మబ్బులు కమ్ముకోవడంతో దిగుబడి తగ్గుతూ వస్తోంది. జీడి పంట నష్టాన్ని చవిచూస్తున్న గిరిజన రైతులకు ఈ ఏడాది కూడా ప్రకృతి పగ వీడలేదు. ఈ ఏడాదైనా జీడి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అనుకున్న సమయంలో గత పది రోజుల నుంచి కారు మబ్బులు కాయడంతో జీడి పంటకు టి దోమ సోకింది. ఎకరా జీడి ఉన్నచోట అర ఎకరా కూడా పంట వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో విస్తారంగా జీడితోటలు ఉన్నాయి. గిరిజన రైతులకు ప్రధానమైన పంట జీడి. తమ జీవనానికి, ఆర్థిక ఇబ్బందులు తీరేందుకు జీడిపంట ఎంతగానో దోహదపడుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు. అయితే గత నాలుగేళ్ల ఏళ్ల నుంచి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి ఉండడంలేదని అంటున్నారు. అధిక శాతం మంది రైతులు జీడి, చింత పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.



ఏజెన్సీలో సాగవుతున్న జీడిపంట

పురుగు మందులు సరఫరా లేదు...

గత మూడేళ్ల నుంచి జీడి పంటకు తీవ్రనష్టం వాటిల్లితున్నా రక్షణ చర్యలు చేపట్టడంలో అటు ప్రభుత్వం, ఇటు ఐటిడిఎ అధికారులు శ్రద్ధ వహించడం లేదు. దీంతో ప్రతి ఏటా జీడి పంటపై ఆశలు పెట్టుకున్న రైతులకు తీవ్ర నిరాశే మిగులుతుంది. ఈసారైనా అధికారులు మేల్కొని జీడి పంట నష్ట నివారణకు పురుగు మందులు సరఫరా చేయాలి.

కోలక అవినాష్,
ఎపి గిరిజన సంఘం నాయకులు .

జీడి దిగుబడి తగ్గింది....

కారు మబ్బుల వల్ల జీడి పంటకు పురుగు పట్టడంతో ఈ ఏడాది కూడా జీడి పంట దిగుబడి బాగా తగ్గింది. పిక్కలు కాసిన లోపల పలుకు లేకపోవడంతో జీడి అమ్మకాలు చేపట్టినా అనుకున్నంత మద్దతు ధర రాదు. ఈ ఏడాది ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- పువ్వల స్వామి,
గిరిజన రైతు,పి.ఆమిటి

రుణమాఫీ చేయాలి...

గిరిజన రైతులు పండించే పంటలకు నష్టం వాటిల్లడంతో ఆర్థికంగా చితికి పోతున్నారు. వేలాది రూపాయలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నా పంట చేతికి అందకపోవడంతో కట్టలేని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి రైతులు తీసుకున్న అప్పులకు రుణమాఫీ చేయాలి.

- మండంగి రమణ,
ఎంపిటిసి, చెముడు గూడ

వేల ఎకరాల్లో సాగు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు 10 వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తోందని అంచనా. దీన్ని బట్టి చూస్తే గిరిజన రైతులు జీడి పంటపై ఎంత మేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతుంది. పుష్కలమైన జీడి తోటలున్నప్పటికీ మద్దతు ధర లభించకపోవడంతో ఆర్థికంగా అభివద్ధి చెందలేకపోతున్నారు.



వెంకటరావుకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అంకితభావం కలిగిన వ్యక్తి వెంకటరావు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా రెవిన్యూ అధికారి వెంకట రావు పని పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి అని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బదిలీపై వెళుతున్న డిఆర్‌ఒ జె.వెంకటరావుకు కలెక్టరేట్‌లో శనివారం వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ జిల్లా రెవిన్యూ అధికారి అని ప్రశంసించారు. పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ వెంకట రావు చక్కటి సమయస్ఫూర్తి గల అధికారి అన్నారు. నూతన పోస్టింగ్‌కు మరింత వన్నె తెగలరని ఆయన ఆకాక్షించారు. అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు శాఖల మధ్య మంచి సమన్వయం చేశారన్నారు. అనంతరం వెంకట రావు మాట్లాడుతూ జిల్లాలో డిఆర్‌ఒగా పనిచేయడం గొప్ప సంతృప్తి ఇచ్చిందన్నారు. కొత్త జిల్లా అభివృద్ధిలో సభ్యుడిగా ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లా అధికారులు బాగా పనిచేయుటకు చక్కని అవకాశం కలెక్టర్ కల్పించారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వెంకట రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె. హేమలత, పాలకొండ ఆర్‌డిఒగా పనిచేసి బదిలీ అయిన ఎం. లావణ్య, కెఆర్‌ఆర్ సి ఎస్డిసి జి కేశవ నాయుడు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా కార్మిక శాఖ అధికారి కె. రామ కృష్ణా రావు, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి ఎస్ వేణుగోపాల రావు, డిటిఒ టి.వి.ఎస్.సుధాకర్, డిఎస్‌ఇఒ జిల్లా మార్కెటింగ్ అధికారి ఎల్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా భూగర్భ జలాల అధికారి ఏ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఖజానా అధికారి ఏ మన్మథ రావు, రెవిన్యూ సంఘం అధ్యక్షులు శ్రీరామమూర్తి, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగ అధిపతులు రవి కుమార్, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'రియల్' కారణాలేనా..?

తహశీల్దార్ హత్యతో ఉలిక్కిపడ్డ రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి - మధురవాడ

విశాఖలోని చినగదిలి మండల తహశీల్దారుగా పనిచేసి ఇటీవలే విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ అయిన సనపల రమణయ్య దారుణ హత్యకు గురవడంతో విశాఖ, విజయనగరం జిల్లాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. తమ భద్రతపై రెవెన్యూ ఉద్యోగులు కలవరపాటుకు గురయ్యారు. రియల్ ఎస్టేట్, భూవివాద అంశాలే రమణయ్య హత్యకు కారణాలుగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మీడియా సమావేశంలో శనివారం మధ్యాహ్నం ప్రస్తావించారు.

రమణయ్య సొంతూరు.. శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం దిమ్మిలాడ. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. పదేళ్ల క్రితం విధుల్లో చేరిన ఆయన ఉత్తరాంధ్రలోని వజ్రపుకొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ (చినగదిలి) మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. తొలిరోజు శుక్రవారం విధులకు హాజరై రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న ఆయనపై 10 గంటల సమయంలో దాడి జరిగింది. ఇనుపరాడ్డుతో గుర్తు తెలియని వ్యక్తి తలపై కొట్టడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. అనంతరం ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

ముక్కుసూటి మనిషిగా రమణయ్యకు పేరు

ముక్కు సూటి మనిషిగా, అవినీతికి దూరంగా ఉండే వ్యక్తిగా రమణయ్యకు పేరు. భూదందాలకు పట్టుంద పరుగా ఉన్న చినగదిల మండలంతోపాటు ఆయన పలుచోట్ల రెవెన్యూ విభాగంలో పనిచేశారు. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సహకరి ంచకపోవడమే ఈ హత్యకు కారణ మేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లో రమణయ్యకు నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

పార్వతీపురంరూరల్ : విజయనగరం జిల్లా బొండపల్లి మండల తహశీల్దార్ రమణయ్య హత్యను ఎపి రెవెన్యూఅసోసియేషన్ జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. తహశీల్దార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సంతాపం జరిగింది. కార్యక్రమంలో ఎస్‌డిసి జి.కేశవనాయుడు, ఇన్‌ఛార్జి ఎఒ చంద్రమౌళి మాట్లాడుతూ తహశీల్దార్ హత్యకు కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని, నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అధిక భూ వివాదాలున్న తహశీల్దార్లకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. సంతాప సభలో పలువురు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కురుపాం :విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తహశీల్దార్ ఎస్.రమణయ్య హత్యను నిరసిస్తూ మండలంలోని రెవెన్యూ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఉప తహశీల్దార్లు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : రమణయ్య హత్యకు నిరసనగా స్థానిక రెవెన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి కల్పించాలని కోరారు. హత్యకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ కె,జయప్రకాష్, డిటి సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐ నాయుడు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాచలం, డివిజన్ అధ్యక్షులు పి రఘుబాబు, మండల అధ్యక్షులు జి అప్పలనాయుడుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మోసకారి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసగించిన మోసకారిగా చంద్రబాబు అని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో ఆసరా మహిళలకు రుణమాఫీ చెక్కులను శనివారం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో ప్రజలకు జనరంజకమైన పాలన అందించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి మళ్లీ అబద్ధాల ప్రచారంతో ప్రజలను మోసగించేందుకు బయలుదేరుతుందని, వాటిని నమ్మొద్దని మహిళలకు సూచించారు. మళ్లీ వైసిపి అధికారంలోకి తప్పక వస్తుందనిధీమా వ్యక్తం చేశారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా అన్ని సంక్షేమ పథకాలు ప్రజలు ఖాతాలోకి జమ అవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని మహిళలను కోరారు.

మూడు పదవులు పొంది చేసింది ఏమిటి..?

2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో కొనసాగిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి మూడు పదవులు ఉన్నప్పటికీ ప్రజలకు ఏ విధమైన ఉపకారం చేయలేదని రాజన్నదొర విమర్శించారు. శనివారం మక్కువలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తే అంతే ధీటుగా తాము కూడా సమాధానం చెబుతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము చేసిన అభివృద్ధి గణాంకాలతో సహ వివరిస్తామని గతంలో ఎన్నోసార్లు చెప్పామన్నారు. తప్పుడు మాటలతో తమ అనుకూల మీడియాలో ప్రచారం చేస్తూ ఉండడాన్ని ఆయన ఖండించారు. ఎస్టి కమిషన్ ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవులు చేపట్టిన సంధ్యారాణి గానీ, అంతకుముందు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భంజ్‌దేవ్ గాని సాలూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి గురించి బహిరంగంగా చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రంగునాయుడు, జెడ్‌పిటిసి శ్రీనివాసరావు, ఎంపిపి పారమ్మ, ఎంపిడిఒ దేవకుమార్, ఏటిఎం సన్నిబాబు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ గ్రామాల కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వీరఘట్టం: అందరికీ న్యాయం చేసేలా పాలన అందిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే వీ కళావతి ఎమ్మెల్సీ పి విక్రాంతులు అన్నారు. మండల కేంద్రంలోని నాలుగో విడత వైయస్సార్ ఆసరా కానుక పంపిణీ కార్యక్రమం పాల్గొని మాట్లాడారు. అనంతరం 15 వేల పైచిలుక డ్వాక్రా సంఘ సభ్యులకు రూ.9 కోట్లు పైబడి ఆసరా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి పి విజయకుమారి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గోవిందరావు , వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ కె.లీల ప్రసాద్ , ఎంపిడిఒ ఎస్. సాల్మన్ రాజు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, మండల మహిళా అధ్యక్షులు పి సుజాత, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పాచిపెంట : ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పాచిపెంట

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.సుభాషిని, వై.మంగమ్మ, సిహెచ్ రామకోలా, జి.కల్యాణి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు వేతనం చెల్లిస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి పిల్లలకు వేడివేడి అన్నం పెట్టి తమ ఆరోగ్యాలను కూడా లెక్కచేయకుండా పనిచేసిన వంటమ్మలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలన్నారు. రాజకీయ వేధింపులు మానుకొని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వంట చేస్తుండగా సంభవించిన ప్రమాదం ఏర్పడి చనిపోయిన రమాదేవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్ పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం ఎంఇఒ-2 పి.సతీష్ కుమార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

బలిజిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షులు యు.లక్ష్మి, కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ దీర్ఘకాలంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని, దీంతో ఈ పథకం నిర్వహణ చాలా కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరచూ మెనూ మారుస్తున్నప్పటికీ మెస్ ఛార్జీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మెనూ ఛార్జీలు, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 5న డిఇఒ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు లక్ష్మి, భవాని, తెరేజా, భాగ్యం, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక

విజయనగరంకోట : స్థానిక బిసి కాలనీ ప్రభుత్వ ఐటిఐలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. 83 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాకు హాజరయ్యారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్-6, ఫైనాన్షియల్ కల్సల్టెంట్-50, ఇంటెల్ సర్వ్‌లో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీసు వర్క్- 25 ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వీరిలో 42 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. ఈ మేళాను జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు సిబ్బంది పర్యవేక్షించారు.

పాలకొండ ఆర్‌డిఒగా వెంకటరమణ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై పాలకొండ ఆర్‌డిఒగా వచ్చారు. పాలకొండ ఆర్డీవో పని చేసిన లావణ్య ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా బదిలీపై వెళ్లిపోయారు. ఆర్డీవో వెంకటరమణ ముందుగానే పార్వతీపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టకు పూలమొక్కను అందజేస్తున్న ఆర్‌డిఒ వెంకటరమణ

ఎన్‌టిఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

తెలుగువారి గుండె చప్పుడు అయినా నందమూరి తారక రామారావుకు భారతరత్న పురస్కారాన్ని అందజేయాలని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ స్థాయిలో తీసుకువెళ్లడమే కాకుండా, ఆంధ్రులకు ఒక గౌరవాన్ని తీసుకువచ్చిన మహా వ్యక్తి అన్న ఎన్‌టియార్ అని, నేడు దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సంక్షేమ పథకాలకు ఆధ్యుడని, అలాగే చైతన్య రథం ద్వారా ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కల్పించి పార్టీ స్థాపించిన ఆరు నెలల్లోనే సంక్షేమ ప్రభుత్వాన్ని అందించిన ఘనత ఎన్టీఆర్ దేనని అన్నారు. కర్పూరీ ఠాకూర్, అద్వానీకి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించడం హర్షించదగ్గ పరిణామమని అన్నారు. అలాగే వారందరికీ ఏమాత్రం తీసుకొని ఎన్‌టిఆర్‌కు కూడా భారతరత్న ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కురుపాం అటవీ బీట్ అధికారి కిరణ్ సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా శనివారం మండలంలోని పెల్లివలస, మంత్రజోల, మర్రిగూడ గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. అగ్ని ప్రమాదాల వల్ల పరిసర ప్రాంతాలల్లో వృక్ష జాతి అంతరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల గిరిజనులు పాల్గొన్నారు.

ఉన్నవాటికే టికానా లేదు.. కొత్తగానా..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక వాడలు వెలవెలబోతుంటే... మరోవైపు పరిశ్రమల ఏర్పాటుకు కొత్తగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తారట. పారిశ్రామికాభివృద్ధి పేరిట సాగుతున్న ఈ భూబాగోతం ఎవరి కోసమో? అంటూ జనం చర్చించుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు పారిశ్రామిక వాడల్లో కావాల్సినంత స్థలాలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయి. ఇవి కాకుండా జిల్లాలో జూట్, ఫెర్రో ఎల్లాయిస్, చెరకు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. మూతపడినవి తెరిపించాలన్న చిత్తశుద్ధి ఎలాగూ లేదు. కనీసం ఖాళీగా ఉన్న పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొంతలో కొంతైనా ఉండేవి. ఈ పారిశ్రామికవాడలను వినియోగించు కోవాలన్న ధ్యాస అటు పాలకులకు గానీ, ఇటు అధికారులకు గానీ లేకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వివిధ పారిశ్రామిక యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ నిన్నగాక మొన్న జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో అధికారులు చర్చించిన సంగతి తెలిసిందే. జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామిక వాడల స్థాపన, విస్తరణకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, రాయితీల విడుదల తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో రెండు ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలన్నారు. మెరకముడిదాం మండలం గర్భాం వద్ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్స్, భీమాలి వద్ద మామిడి తాండ్ర తయారీ క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



ఈ నేపథ్యంలో పాత పారిశ్రామికవాడల్లో ఖాళీగా ఉన్న స్థలాల సంగతేమిటి? అంటూ జనం చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా 1981లో బొబ్బిలిలో ఏర్పాటుచేసిన గ్రోత్ సెంటర్ వెలవెలబోతోంది. ఇందులో ప్రస్తుతం సుమారు 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల 137 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ప్లాట్లలో ఏర్పాటు చేసిన కంపెనీల్లో చాలా వరకు మూతపడ్డాయి. ఇటు విజయనగరంలో విటి అగ్రహారంలో రూ.కోట్ల విలువ చేసే ప్లాట్లు సుమారు 30 వరకూ ఖాళీగానే ఉన్నాయి. సారిపల్లి, కొత్తవలస మండలం కంటకాపల్లి పారిశ్రామికవాడల్లోనూ ఎకరాల తరబడి స్థలాలు ఉన్నాయి. వీటిలో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా కొత్తగా భూములు సేకరించి, వాటికి పారిశ్రామిక క్లస్టర్లు అనే పేరు పెట్టడం వెనుక ఏదో అవినీతి, అక్రమాల బాగోతాలు ఉండే ఉంటాయంటూ జనం నుంచి అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే ఖాళీ ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేవారని అంటున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టుగా ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికారంలో ఉండగానే భూములు దోచుకోవాలన్న తలంపుతో కొత్తగా పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు అంశాన్ని తెరపైకి తెచ్చారని జనం విమర్శిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన పిఒ

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శనివారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్సీయం పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పిఒ పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం భవనం పాతబడి ఉందని, ఆ స్థానంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని పోలింగ్ కేంద్రంగా వినియోగించాలని సూచించారు. అలాగే కొత్తగా కేటాయించిన పోలింగ్ కేంద్ర భవనం మార్పు గురించి సంబంధిత ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్సిఎం పోలింగ్ కేంద్రంలో పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పరుశురాంపురంలోని ఎంపిపి పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమయ్యే ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఎన్.పారాపురంలోని ఎంపిపి పాఠశాల పోలింగ్ కేంద్రం, అరదలి ఎంపియుపి పోలింగ్ కేంద్రాలను పిఒ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, ఎంఇఒ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు వ్యతిరేక బడ్జెట్ అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర అన్నారు. రైతు వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను కొమరాడలో శనివారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఉపేంద్ర, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతులకు వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని అన్నారు. ఈరోజు రైతాంగానికి సంబంధించి రైతులు పండించిన వివిధ పంటలను గిట్టిబాటు కల్పించేలా గాని, అలాగే ఎరువులు, విత్తనాలు ఇచ్చే పరిస్థితి గానీ అలాగే మూడు నల్ల సాగు చట్టాలను రద్దు చేస్తామని చెప్పినప్పుడు ఆ చట్టాల విషయంలో గానీ ఈరోజు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎంతవరకు ఫలితం లేని పరిస్థితి ఉందని తెలిపారు. కావున రైతులు ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఎంఇఒలకు డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖ అధికారి-1లకు వారి జీతభత్యాలు డ్రా చేసుకునేందుకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఇఒ-1 అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు శనివారం ఆయన తెలిపారు. అలాగే జీవో 89 ప్రకారం ఎంఇఒ-1, ఎంఇఒ-2లకు స్పష్టమైన జాబ్‌చార్ట్‌ను విడుదల చేసినప్పటికీ, చాలా జిల్లాల్లో డిఇఒలు ఎంఇఒ-1లకు అన్ని రకాల విధులను చేయాలని ఆదేశిస్తుండడంతో తమపై పని ఒత్తిడి అధికమౌతోందని అన్నారు. ఎంఇఒ కార్యాలయాల నిర్వహణా ఖర్చులు ఈ ఏడాది ఇంత వరకూ విడుదల చేయకపోవడంతో ఎంఇఒ-1లు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అంతేకాక ఎంఇఒ కార్యాలయ నిర్వహణ ఖర్చులు పెరిగిన దృష్ట్యా ఎంఇఒ ఆఫీస్ గ్రాంట్లను రెండులక్షల రూపాయలకు పెంచాలని కోరారు. ఈ విషయాన్నింటినీ కమిషనర్ దృష్టికి లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు సామల పేర్కొన్నారు.

సారా తయారు చేసినా, అమ్మినా నేరమే

ప్రజాశక్తి - సాలూరు

నాటుసారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా నేరమేనని టౌన్ సిఐ జిడి బాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పెద్దవీధిలో యువకులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సారాతో పాటు మత్తు పదార్ధాలను విక్రయించినా, రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణిస్తూ కేసు నమోదు చేస్తామని చెప్పారు. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడితే రౌడీషీట్, పిడి యాక్ట్ కింద కేసులు పెడతామని చెప్పారు. ప్రధానంగా యువకులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుకునే యువకులు ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు చిన్న వయసులో పిల్లలను సంపాదన కోసం ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనకుండా చూడాలని కోరారు. అనంతరం వీధి ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కెవి సురేష్, వార్డు కౌన్సిలర్ సువర్ణమ్మ పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని టిడిపి-జనసేన ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. నేటికి మూడేళ్లు కావస్తున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో భారీ వాహన రాకపోకల వల్ల దుమ్ము ఎగరడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, అరకు పార్లమెంటరీ తూర్పు కాపు అధ్యక్షులు పి.కృష్ణమూర్తినాయుడు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పి.వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనీల్, అరకు పార్లమెంటరీ వాణిజ్య విభాగం అధ్యక్షులు టి.రమేష్, టిఎన్‌యుసిఎన్ శశి కుమార్, బి నీలకంఠమ నాయుడు, ఏ కుమారస్వామి బి హరిబాబు, కార్యకర్తల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో బాబు ష్యూరిటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దేవానపురం పంచాయతీ పరిధిలో గల రుక్మిణిగూడలో పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలును వివరిస్తూ ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబునాయుడు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ గెడెల కాంతారావు, సీనియర్ నాయుకులు సవర సోడంగి, తెలుగుయువత అధ్యక్షులు సిరిపురం జగదీశ్, లీలాప్రసాద్, సవర రుగ్గయ్య, సవర సురేష్, సవర ఆనందరావు, కార్యకర్తలు, ప్రజలు నాయకులు పాల్గొన్నారు.



గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు జయకృష్ణ

మెగా డిఎస్‌సి కాదు... దగా డిఎస్‌సి

యువతకు ఉపాధి కరువు
మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ అని, 50,892 ఖాళీలుంటే కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడమేనని మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. అరకు పార్లమెంట్ పరిధిలో గల కురుపాం నియోజక వర్గ ముఖ్య నేతలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని డిఎస్‌సి పేరుతో జగన్ రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారని, నిరుద్యోగుల్ని మరోసారి వంచించడానికి సిఎం జగన్ సిద్ధమయ్యాడని అన్నారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నాలుగన్నరేళ్లు జగన్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించిందని, ఇప్పుడు జగన్ రెడ్డి కేవలం 6,100 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల హామీల్లో భాగంగా చేసిన ఏటా మెగా డీఎస్సీ.. జాబ్ క్యాలెండర్.. 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ నిర్వాకంతో దేశవ్యాప్తంగా 11శాతం నిరుద్యోగం ఉంటే... ఒక్క ఎపిలో 24శాతం ఉందన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా జగన్‌మోహన్‌రెడ్డి మార్చారన్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్రప్రదేశ్‌గా, గంజాయి ఉత్పత్తిలో నంబర్-1గా రాష్ట్రాన్ని చేసి గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేని జగన్‌రెడ్డి చేతగాని తనంతో రాష్ట్రవ్యాప్తంగా 1745 మంది యువత బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉంటే గంజాయి, కల్తీ మద్యం తాగి సైకోలుగా మారుతామన్న భయంతోనే యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్ పరీక్ష వాయిదా వేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థులకు జగన్ మేనమామ కాదని... సైకో మామని సంభోదించారు. విద్యా వ్యవస్థతో జగన్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని, సభ కోసం 5 లక్షల మంది విద్యార్థుల పరీక్షలు వాయిదా వేయకూడదని ఈ ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్‌కు తెలియదా అని ప్రశ్నించారు. టిడిపి రాష్ట్రానికి కంపెనీలు తీసుకొస్తే జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి గంజాయిని తెచ్చాడని ఆరోపించారు. కార్యక్రమంలో కురుపాం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, రాష్ట్ర కార్యదర్శి వీరేష్ దేవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ముదిలి, అరుకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోట సుమన్, గరుగుబిల్లి మండల కన్వీనర్ అక్కేన మధుసూదన రావు, మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి వెంపటాపు భారతి, కురుపాం మండల టిడిపి అధ్యక్షులు కొండయ్య, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి సుకేస్ చంద్రపండా, గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, పాడి సుదర్శనరావు, జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహ కార్యదర్శి డొంకాడ రామకృష్ణ, జియమ్మ వలస క్లస్టర్ ఇంచార్జి జోగి భుజంగరావు, మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి నందివాడ కృష్ణబాబు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

పార్వతీపురంరూరల్ : ఐదేళ్లుగా మెగా డీఎస్సీ ప్రకటిస్తారని ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి దగా డిఎస్‌సిని ప్రకటించారని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసగించే ముందుకు ప్రభుత్వం కంటితోడుపుగా అరకొర ఖాళీలతో డీఎస్సీపి ప్రకటించిందని ఇది సాధ్యం కాదని అన్నారు. నిరుద్యోగులు జగన్మోహన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని, బాబు వస్తేనే జాబ్ వస్తుందనే నమ్మకంతో ఉన్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేయ గల ఏకైక నాయకుడు చంద్రబాబేనని ప్రజలు ఎప్పుడో గ్రహించారని మరికొద్ది రోజుల్లో తీర్పు చెప్పబోతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, కోల సరితా మధు, బుడితి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజావక్తి - వీరఘట్టం

స్థానిక తహశీల్దారుగా కె.జయప్రకాశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఎఫ్ఎసి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ సత్యనారాయణ డిటిగా కొనసాగనున్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

58 ఏళ్లు దాటిన అన్ని శాఖల ఉద్యోగులకు ఎన్నికల విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎపి ఎస్‌టియుఎస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రినాధరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శనివారం కురుపాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 58 ఏళ్లు దాటిన ఉద్యోగులు వయోభారంతో ఇబ్బంది పడుతుంటారని, ఎన్నికల విధులు నిర్వహించాలంటే వారికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. అంతేకాక బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు, ఆరోగ్యపరంగా ఇబ్బందిలు ఉంటాయని, కావున వీరందర్నీ ఎన్నికల విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

గిరిగ్రామ్‌గా కుమ్మరిగండి

ప్రజాశక్తి - సీతంపేట

పర్యాటక అభివృద్ధిలో భాగంగా మండలంలోని కుమ్మరిగండి గ్రామాన్ని గిరి గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నట్లు పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు తెలిపారు. గిరి గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవకాశాల పరిశీలనకు ఎంపిడిఒ గీతాంజలితో కలిసి కుమ్మరిగండి గ్రామాన్ని శనివారం పర్యటించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి వేగవంతం చేయాలని, ఇందులో భాగంగా గిరి గ్రామంగా ఒక గ్రామాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన చెప్పారు. ఈ మేరకు కుమ్మరిగండి అన్ని విధాలా అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. దీనిపై నివేదికను కలెక్టర్, సీతంపేట ఐటిడిఎ పిఒకు అందజేస్తామని ఆయన అన్నారు. గిరి గ్రామంగా ఏర్పాటుకు గ్రామస్తుల అభిప్రాయాన్ని సేకరించామని, అందుకు తగిన విధంగా ప్రణాళికలు తయారు చేస్తామని తెలిపారు. మంచి వ్యూ పాయింట్లు, చుట్టూ అందమైన ప్రకృతి రమణీయతలతో పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల చదువు, ఆహార పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిగండి గ్రామాన్ని పరిశీలిస్తున్న జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

8న ఆశాల చలో విజయవాడ

ప్రజాశక్తి -పాలకొండ

కనీస వేతనాలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సెలవులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలతో ఈనెల 8న ఆశా వర్కర్ చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో విజయవాడ ఆశా వర్కర్ల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, మెటర్నటీ లీవ్స్ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, మొబైల్ వర్లపై శిక్షణ ఇవ్వాలని, పిహెచ్‌సికి పిలిచిన ప్రతి సందర్భంలోనూ టిడి, డిఎలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని, తదితర సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ (సిఐటియు)ఆధ్వర్యంలో ఈనెల 8న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు కె.గౌరీశ్వరి, స్థానిక ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఎం.ధనలక్ష్మి, కె.శాంతి, పి.శ్రీదేవి, టి.రాధారాణి, సిహెచ్ ప్రభావతి, పి.కన్యాకుమారి, ఎస్.శాంతి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టోను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కురుపాం మండల క్లష్టర్ ఇన్చార్జి రంజిత్ కుమార్ నాయకో అన్నారు. మండలంలోని పెదగొత్తిలి పంచాయతీలో సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో పి.లేవిడి నుంచి నీలకంఠాపురం వరకు 14 పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టో, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ తదితర అంశాలను గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ టిడిపి పెడుతున్న పథకాలు గూర్చి వివరించి రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకరరావు, ప్రదీప్, యువరాజు, మాజీ సర్పంచులు దుర్గారావు, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాల జారీపై విచారణ చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - కురుపాం

ఎస్టీ నకిలీ ధ్రువీకరణ పత్రాల జారీపై సమగ్ర విచారణ చేపట్టి మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ శనివారం వినతిపత్రం అందించారు. మండలంలోని మొండెంఖల్‌కు సంబంధం లేని కొంతమంది వ్యక్తులు ఎస్టీ మన్నం దొర కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయమని సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, కానీ వారికి, గ్రామానికి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నకిలీ ఎస్టీలు ధ్రువీకరణ పత్రాల ఆపాలని తహశీల్దార్‌ను కోరారు.

పండ్ల తోటలకు సంజీవని మజ్జిగ ద్రావణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న జీడి, మామిడిపండ్ల తోటలకు పూత, పిందె నిలబడడానికి, అన్ని రకాల ఆకుమచ్చ, కాయ మచ్చ బూజు తెగులు నివారణకు పుల్లటి మజ్జిగ ద్రావణం సంజీవిలా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు శనివారం రైతులు కుసుమమ్మ, కోలక కామేష్, ఎం.వెంకట్రావు, చంటిచే ఈ ద్రావణాన్ని తయారు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎకరాకు వంద లీటర్ల నీటిలో, ఆరు లీటర్ల పుల్లటి మజ్జిగ (ఆరు రోజులు పులిసినది) పంటలకు పిచికారీ చేయడం వల్ల పండ్ల తోటల్లో ఆశించిన ప్రయోజనం కలగడంతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అన్నారు. ప్రతి రైతు తమకున్న పండ్ల తోటల్లో తప్పనిసరిగా పుల్లటి మజ్జిగ ద్రావణం తయారు చేసుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే మొక్క చుట్టూ కందకం తీసి రాలిన ఆకులు అందులో వేసుకుంటే అకాల వర్షాలు పడినప్పుడు ఆ ఆకులు కుళ్లి ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. పంచగవ్య కూడా తయారు చేసుకొని పండ్ల తోటలకు ఉపయోగించాలని, పంటలకు పురుగులు. తెగుళ్ల సోకకుండా దిగుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జి.నిర్మల, ఢిల్లీశ్వరరావు, పరశురాం, వెంకటేష్ పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు

ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట సచివాలయ పరిధిలో పనుకుపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎ.జోగారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సేవలు అందించేలా ప్రభుత్వం అందించిన అన్ని సబ్సిడీలు, ఆధునీకరణ యంత్రాలు రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులు తీసుకోవచ్చన్నారు. రూ.25 లక్షల వ్యయంతో ఈ కేంద్రం నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరామనాయుడు, సర్పంచ్ శ్రీహరినాయుడు, మాజీ ఎంపిటిసి జొన్నాడ విక్టర్, అంటిపేట, కోట సీతారాంపురం ఎంపిటిసి సభ్యులు మహాలక్ష్మి, గణపతి, నిర్మల, పంచాయతీరాజ్ ఎఇఒ జి.చంద్రమౌళి వ్యవసాయ శాఖ ఎఒ ఎస్ అవినాష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కత్తులకవిటిలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు స్థిరమైన పాలన అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సరోజిని, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వర రావు, ఎంపిటిసి కె.పరిమిల, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గోవిందరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కెవెల్ ప్రసాద్, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి లతామాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, పి.ధవలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్, రీసర్వే వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లే అవుట్‌లో ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు కృషి చేయాలని, దీంతో పాటు జగనన్న రీ సర్వేను కూడా వేగవంతం చేయాలని సంబంధిత అధికారులతో మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో గల పలు విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచిస్తూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణతో పాటు, పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అనధికార కట్టడాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు అందజేసి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఇన్చార్జి మేనేజర్, రెవెన్యూ అధికారి దిబ్బా రూబేను, డిఇ కిరణ్‌కుమార్, టిపిఒ పి.కనకారావు, ఎఇలు జి.ఆనంద్, సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి.నారాయణరావు, జి.వినయ్ కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సింహాచలం

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల5న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కూనేరు సంతలో శనివారం ప్రచారం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు, నాగేశ్వరరావు, ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే వేసవి సమీపిస్తున్న తరుణంలో ప్రధానంగా గిరిజనులు మంచినీటి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పోడు పట్టాలు ఇవ్వాలని, రహదారి పనులు పూర్తి చేయాలని తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు బాలయ్య, సింహాచలం, బాబురావు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని మండల ఎంఇఒ జనార్ధన్ నాయుడు అన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్, నీడ్ సంస్థ సహకారంతో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో విద్యార్థులకు షేక్ గౌస్ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎవరైనా పిల్లలు తీవ్ర ఒత్తిడి లేదా ఇతర మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తిస్తే వారికి తగిన కౌన్సిలింగ్‌తో పాటు అవసరం మేరకు మందులు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సర్పంచ్‌పై ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావుపై తహశీల్దార్ జె.రాములమ్మ చేసిన అసత్య ఆరోపణలను నిరసిస్తూ గ్రామస్తులు సర్పంచ్‌కు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్ పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సర్పంచి గౌరీశంకర్రావుతో గ్రామస్తులు నిరసన తెలిపారు. ఉత్తమ సర్పంచిగా గౌరీశంకర్రావు ప్రజలచే గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. అలాంటి సర్పంచ్‌పై తహశీల్దార్ చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

900 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఎర్రడ్లవలసకు చెందిన పుంగారి గౌరీస్ శనివారం ద్విచక్ర వాహనంపై బడ్నాయకవలస మీదుగా పాచిపెంట వైపు 900 సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పద్మాపురం జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై నారాయణరావుకు, సిబ్బందికి పట్టుబడ్డాడు. ఈ మేరకు సారా ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గౌరీష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు